



స్టార్ త్రినేత్రం
PRGI NO : TGTEL /25/A0438
అనుక్షణం అక్షరసత్యం
తెలుగు దినపత్రిక




వరంగల్ | సంపుటి : 1 | సంచిక : 232 | ఎడిటర్ : డీ.శివకృష్ణ | ఆదివారం, 1-2-2026 | పేజీలు: 4 | వెల: 2
WARANGAL VOL-1 ISSUE-232 Editor: D.SHIVAKRIHSNA SUNDAY, 1-2-2026 Pages: 4 Price: 2
Publised From Warangal: Circulated in Hyderabad, Rangareddy, Warangal, Khammam, Nalgonda, Medak, Karimnagar & TG All Districts

## సిట్ నోటీసులపై KCR అభ్యంతరం.. జూబ్లీహిల్స్ ఏసీపీకి సంచలన లేఖ

**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్ :**




ఫోన్ ట్యాపింగ్ కేసు లో రెండోసారి సిట్ అధికారులు జారీ చేసిన నోటీసులపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్పందించారు. ఈ మేరకు శనివారం జూబ్లీహిల్స్ ఏసీపీకి లేఖ రాశారు. మాకు చట్ట ప్రకారం నోటీసులు ఇవ్వలేదు. నాకు ఇచ్చిన నోటీసు అక్రమం. నోటీసు ద్వారా నా గౌరవానికి భంగం కలిగించారు. ఇంటి గోడలకు నోటీసులు అంటించడం ఏంటి. ఇది సరైన పద్ధతి కాదు. చట్టపరమైన అభ్యంతరాలు ఉన్నా విచారణకు సహకరిస్తా. నందినగర్ నివాసంలో విచారణకు హాజరవుతా అని లేఖలో కేసీఆర్ పేర్కొన్నారు.

▶ మిగతా 2లో

## హైదరాబాద్‌లో అతిపెద్ద వ్యవసాయ ఎగ్జిబిషన్.. తేదీ ఫిక్స్

**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్ :**

రైతుల కోసం మూడు రోజుల పాటు హైదరాబాద్‌లో అగ్రి షో పేరుతో అతి పెద్ద వ్యవసాయ ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు రైతుబడి సంస్థ నిర్వాహకులు రాజేందర్ రెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 20, 21, 22 తేదీల్లో మూడు రోజుల పాటు ట్యాంక్ బండ్ దిగువన ఉన్న ఎన్టీఆర్ స్టేడియంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. మూడు రోజుల్లో లక్ష మంది రైతులు హాజరవుతారనే అంచనాతో ఏర్పాట్లు చేపడుతున్నామని అన్నారు. దేశ, విదేశాలకు చెందిన నూతన వ్యవసాయ సాంకేతికతను వివరించేందుకు 500 కు పైగా కంపెనీలు ఈ ప్రదర్శనలో స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నాయని చెప్పారు. నూతన యంత్రాలు, ఏఐ టెక్నాలజీ, డ్రోన్ టెక్నాలజీ, విత్తనాలు, మొక్కలు, ఎరువులు, డ్రిప్ పరికరాల వంటివి ఎన్నో ప్రదర్శనకు వస్తాయన్నారు. మూడు రోజుల్లో పలు అంశాలపై సదస్సులు సైతం జరుగుతాయని వివరించారు. సందర్శకులు ముందుగానే www.rbagrishow.com వెబ్ సైట్ ద్వారా టిక్కెట్ బుక్ చేసుకోవచ్చని, అలా చేసుకోలేని వాళ్లు నేరుగా రావచ్చునన్నారు.




## గొంతెమ్మ కోర్కెలొద్దు.. పొత్తులపై తేల్చేసిన పొంగులేటి

**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్ :**



మున్సిపల్ ఎన్నికల్లో ప్రధాన పార్టీల మధ్య పొత్తుల వ్యవహారం చర్చనీయాశంగా మారింది. అసెంబ్లీ ఎన్నికల్లో మిత్రపక్షాలుగా కొనసాగిన పార్టీలు ఇప్పుడు ఎవరి దారి వారిదే అన్నట్లు వ్యవహరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పొత్తులపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పందించారు. కలిసి వచ్చే పార్టీలతో ముందుకు వెళ్తామన్నారు. ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గంలోని ఏదులాబపురం మున్సిపాలిటీలో ఆయన ప్రచారం నిర్వహించారు.

▶ మిగతా 2లో

## కేసీఆర్‌కు సిట్ వేధింపులు.. రాష్ట్రవ్యాప్త బీఆర్ఎస్ ఆందోళనలకు కేటీఆర్ పిలుపు



**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్ :**

తెలంగాణ రాష్ట్రంలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. రాష్ట్రంలో తీవ్ర చర్చనీయాంశంగా మారిన ఈ వ్యవహారంలో ఇప్పటికే అధికారులతో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలను విచారించిన సిట్ అధికారులు తాజాగా మాజీ సీఎం కేసీఆర్ కు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. దీంతో బీఆర్ఎస్ నేతలు, న్యాయ నిపుణులతో సుదీర్ఘంగా చర్చించిన అనంతరం కేసీఆర్ హైదరాబాద్ లోని తన నివాసంలో సిట్ విచారణకు హజరవుతానని అధికారులకు సూచించారు.

ఈ క్రమంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా వేధిస్తోందని ఆరోపిస్తూ.. (ఆదివారం) రాష్ట్ర వ్యాప్తంగా భారీ నిరసనలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే ఈ నోటీసులు జారీ చేశారని మండిపడ్డ కేటీఆర్, ప్రభుత్వ తీరును నిరసిస్తూ రాష్ట్రంలోని 12 వేలకు పైగా గ్రామాల్లో కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేయాలని పార్టీ శ్రేణులను ఆదేశించారు.

▶ మిగతా 2లో

# మేడారం జాతర.. చివరి రోజు భారీగా తరలివచ్చిన భక్తులు

**స్టార్ త్రినేత్రం, వరంగల్ :**

మేడారం జాతరకు చివరి రోజైన శనివారం భారీగా భక్తులు తరలి వచ్చారు. జంపన్నవాగులో స్నానాలు చేయడంతో పాటు మేడారం గద్దెల వద్ద దర్శనాలు చేసుకున్నారు. నాలుగు రోజుల పాటు జరిగిన జాతరకు సుమారు కోటిన్నర వరకు భక్తులు వచ్చారని అంచనా వేస్తున్నారు. చివరి రోజు కూడా ఉదయం నుంచే భారీగా భక్తులు తరలివచ్చి అమ్మవార్లను దర్శనం చేసుకున్నారు. జంపన్న వాగు వద్ద జనం పోటెత్తారు.

### చివరి రోజు భారీగానే వీఐపీల రాక

మేడారానికి చివరిరోజు భారీగానే వీఐపీలు వచ్చారు. అమ్మవార్లను దర్శనం చేసుకున్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని కుటుంబ సమేతంగా శని ఉదయం 5 గంటలకు మేడారం శ్రీ సమ్మక్క–సారలమ్మ ఆలయాన్ని సందర్శించి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా గద్దెలపై కొలువైన శ్రీ సమ్మక్క, సారలమ్మ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా నిలువెత్తు బంగారాన్ని తల్లులకు సమర్పించారు.

▶ మిగతా 2లో



## హార్వర్డ్‌లో విద్యార్థుల బృందంతో రేవంత్ రెడ్డి భేటీ

- ఆ పాత్ర నేను ధరించదలుచుకోలేదు
- తెలంగాణ రైజింగ్ బ్రాండ్ అంబాసిడర్లుగా మారండి
- విద్యార్థులకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పిలుపు

**స్టార్ త్రినేత్రం, డెస్క్:**



అమెరికా పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హార్వర్డ్ యూనివర్సిటీలో ప్రతిష్ఠాత్మక లీడర్ షిప్ కోర్సును విజయవంతంగా పూర్తి చేసి అంతర్జాతీయ వేదికపై మరోసారి తెలంగాణకు గుర్తింపు తెచ్చారు. ఈ నెల 25 నుంచి 30 వరకు హార్వర్డ్ యూనివర్సిటీలో నిర్వహించిన లీడర్ షిప్ ఫర్ ది ట్వంటీ ఫస్ట్ సెంచరీ కార్యక్రమానికి సీఎం హాజరై ఆధునిక పాలన విధానాలు భవిష్యత్ నాయకత్వ సవాళ్లు ప్రపంచ ఆర్థిక పరిస్థితులు వంటి అంశాలపై అవగాహన పొందారు. తన అధికారిక అమెరికా పర్యటనలో చివరి రోజు (శనివారం) హార్వర్డ్ యూనివర్సిటీలో వివిధ ప్రతినిధి బృందాలతో సీఎం రేవంత్ రెడ్డి విస్తృతంగా సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా హార్వర్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన వివిధ పాఠశాలల విద్యార్థులు పూర్వ విద్యార్థులతో పాటు మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కొలంబియా యూనివర్సిటీ వంటి

▶ మిగతా 2లో

## ఎన్నిలకు ఇంకా మూడేళ్లు ఉంది.. ఆలోపు ఏదైనా జరగొచ్చు

### MLA షాకింగ్ కామెంట్స్



**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్ :**

మున్సిపల్ ఎన్నికల వేళ గద్వాల నియోజకవర్గ ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. శనివారం ఆయన ఓ మీడియా ఛానల్ ప్రతినిధితో మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపించడానికి చాలామంది నా అనుచరులు, అభిమానులు, మేలు కోరుకునే వారు తీవ్రంగా ప్రయత్నించారు. ఇప్పుడు వారంతా మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు.. వారి కోసం నేను తప్పకుండా ప్రచారం చేస్తా.. గెలిపించుకునేందుకు ప్రయత్నం కూడా చేస్తాను.. నేను ఈ స్థాయిలో ఉండటానికి కారణం వారే అని కీలక వ్యాఖ్యలు చేశారు. ఎక్కడైనా స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీకే ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది. ప్రజలు కూడా ఆ పార్టీవైపే ఉంటారు.. అధికార పార్టీకి ఓటేస్తేనే ఉపయోగం అని నేనూ నమ్ముతానని అన్నారు. ఎవరేం అనుకున్నా గద్వాల నియోజకవర్గ నా అభివృద్ధే నా ధ్యేయమని చెప్పారు.

▶ మిగతా 2లో

## మున్సిపల్ ఎన్నికల ముందు బీఆర్ఎస్ కాంగ్రెస్ కుట్రలు..

### బీజేపీ ఆరోపణలు




**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్ :**

ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ సీఎం కేసీఆర్ విచారణకు వెళ్లాల్సిందేనని తెలంగాణ బీజేపీ స్టేట్ చీఫ్ రామచందర్ రావు అన్నారు. కేసీఆర్ చట్టాలను గౌరవించాలన్నారు. సీఎం హోదాలో ఉండగా నరేంద్ర మోడీ కూడా విచారణను ఎదుర్కొన్నారని ఆయన 10 గంటల పాటు సిట్ విచారించిందని గుర్తు చేశారు. మీడియాతో మాట్లాడిన ఆయన.. సిట్ విచారణకు వెళ్లేవారంతా షో చేస్తున్నారని వీరేమైనా ఫ్రీడమ్ ఫైటర్సా అని ప్రశ్నించారు. రేపో మాపో బీఆర్ఎస్ వారు జైలుకు వెళ్లడం ఖాయం అన్నారు.

▶ మిగతా 2లో



## కేసీఆర్ పై సీఎం రేవంత్ రెడ్డి కక్ష్య సాధింపు రాజకీయాలు

**స్టార్ త్రినేత్రం, సిద్దిపేట :**

తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ పై కక్ష్య పూరితంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీట్ నోటీసుల నేపథ్యంలో ఎర్రవెల్లిలో ఉంటున్నట్లు కేసీఆర్ తెలిపినా..

▶ మిగతా 2లో

## మున్సిపల్ ఎన్నికలపై సీఎం రేవంత్ రెడ్డి జూమ్ మీటింగ్..

### ఇన్‌ఛార్జ్ మంత్రులకు కీలక సూచనలు

**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్ :**



మున్సిపల్ ఎన్నికలపై సీఎం రేవంత్ రెడ్డి అమెరికా నుండి సమీక్ష నిర్వహించారు. పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ జూమ్ మీటింగ్ ఏర్పాటు చేయగా అందులో సీఎం పాల్గొన్నారు. ఈ జూమ్ మీటింగ్ లో జిల్లాల ఇన్ ఛార్జ్ మంత్రులు, రాష్ట్ర కాంగ్రెస్ ఇన్ ఛార్జ్ మీనాక్షి చౌదరి పాల్గొన్నారు. మున్సిపల్ ఎన్నికల నివేదికను సీఎంకు వివరించారు. ఈ సందర్భంగా ఎన్నికలపై సీఎం మంత్రులకు దిశానిర్దేశం చేశారు. 90శాతం స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకోవాలని టార్గెట్ నిర్దేశించారు.

▶ మిగతా 2లో

మొదటిపేజీ తరువాయి

# మేడారం జాతర.. చివరి రోజు భారీగా తరలివచ్చిన భక్తులు

సమ్మక్క, సారలమ్మలను శనివారం హైకోర్టు జడ్జిలు సృజన, రాణి తమ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. పూజారులు, దేవాదాయ శాఖ అధికారులు వారికి ఘన స్వాగతం పలకగా.. వారు అమ్మవారి దర్శనం చేసుకొని మొక్కులను అప్పజెప్పారు. అనంతరం దేవాదాయ శాఖ అధికారులు ప్రసాదం అందచేశారు.
శనివారం వన దేవతలను కుటుంబ సమేతంగా.. ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, సభ్యులు అమ్మవార్లను దర్శించుకున్నారు. దేవాదాయ శాఖ అధికారులు వారికి ఘన స్వాగతం పలికి అమ్మవార్ల ప్రసాదం అందించారు. మహిళా శిశు అభివృద్ధి శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ అనితా రామచంద్రన్ శనివారం శ్రీ సమ్మక్క సారలమ్మని దర్శించుకుని తమ మొక్కులను అమ్మవార్లకి సమర్పించారు. మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతర సందర్భంగా అమ్మవార్లను ఐ.జి తరుణ్ జోషి దంపతులు దర్శించుకున్నారు.
కుటుంబ సభ్యులతో కలిసి శ్రీ సమ్మక్క– సారలమ్మ తల్లుల దర్శనం చేసుకుని రాష్ట్ర హైకోర్టు జడ్జి మాధవి దేవి మొక్కులు తీర్చుకున్నారు. వారికి దేవాదాయ శాఖ అధికారులు ములుగు జిల్లా జ్యోత్స్నలు అమ్మవారి ప్రసాదాలు అందజేశారు. శ్రీ సమ్మక్క– సారలమ్మ తల్లుల దర్శనానికి విచ్చేసి దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించుకున్న హైకోర్టు జడ్జి విజయ్ సేన్ రెడ్డి, ప్రదీప్ అమ్మవార్లను దర్శించుకున్నారు. నిజామాబాద్ శాసన సభ్యులు డాక్టరు భూపతి రెడ్డి అమ్మవార్లను దర్శించుకున్నారు.

### తప్పని ట్రాఫిక్ సమస్యలు..

మేడారం జాతర సందర్భంగా వచ్చే భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు తప్పలేదు. శుక్రవారం సాయంత్రం ఆరంభమైన ట్రాఫిక్ సమస్యలు శనివారం కూడా కొనసాగాయి. పస్రా నుంచి తాడ్వాయి, మేడారం వరకు వాహనాలు గంటల తరబడి నిలిచిపోయాయి. శుక్రవారంతో పోలిస్తే కొంత తగ్గిన ఈ ట్రాఫిక్ సమస్యలు మాత్రం తప్పలేదు.

# సిట్ నోటీసులపై KCR అభ్యంతరం.. జూబ్లీహిల్స్ ఏసీపీకి సంచలన లేఖ

### ఇకనుంచి వచ్చే నోటీసులన్నీ ఎర్రవల్లికే రావాలి

65 ఏళ్లు దాటిన వారిని వారి నివాసం వద్దే విచారించాలని చట్టం చెబుతోందని ఈ సందర్భంగా సిట్ అధికారులకు కేసీఆర్ చేశారు. తన ప్రస్తుత నివాసం ఎర్రవల్లిలో ఉందని, అక్కడే విచారించాలని స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ ఏసీపీకి తనను విచారించే అధికార పరిధి లేదనీ లేఖలో కేసీఆర్ పేర్కొన్నారు. 'నోటీసుల జారీలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పోలీసులు ఉల్లంఘించారు. ఎన్నికల అఫిడవిట్‌లోని చిరునామాకు, సెక్షన్ 160 నోటీసులకు సంబంధం లేదు. ప్రస్తుతం నివసిస్తున్న చోటే విచారణ జరపాలని పార్లమెంట్ చట్టం చెబుతోంది. హరీష్ రావు నోటీసుల విషయంలో పోలీసులు డబుల్ స్టాండర్డ్స్ పాటిస్తున్నారు. పోలీసుల తీరు కోర్టు ధిక్కరణ కిందకే వస్తుంది. బాధ్యతాయుత పౌరుడిగా, ప్రతిపక్ష నేతగా విచారణకు సహకరిస్తా. ఫిబ్రవరి 1వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు సిద్ధం. నంది నగర్ నివాసంలోనే విచారణకు అందుబాటులో ఉంటా. అక్రమ పద్ధతిలో ఇచ్చిన నోటీసులను తాను విస్మరించవచ్చు. కానీ నేను ఆపని చేయడం లేదు. భవిష్యత్తులో నోటీసులన్నీ ఎర్రవల్లి చిరునామాకే పంపాలని పోలీసులకు సూచన చేస్తున్నాను. పోలీసుల చర్యలు తన వ్యక్తిగత గౌరవానికి భంగం కలిగించేలా ఉన్నాయి' అని లేఖలో కేసీఆర్ ఆవేదన చెందారు. అంతేకాదు.. ఏపీ హైకోర్టులోని 'వీడీ మూర్తి' కేసు తీర్పును లేఖలో కేసీఆర్ ప్రస్తావించారు.

# మున్సిపల్ ఎన్నికలపై సీఎం రేవంత్ రెడ్డి జూమ్ మీటింగ్..

రెబల్స్ బెడద లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇదిలా ఉంటే రాష్ట్రంలో ఫిబ్రవరి 11న ఎన్నికలు జరగనున్నాయి. ఈ నెల 28న నామినేషన్ల ప్రక్రియ మొదలవ్వగా జనవరి 30న ముగిసింది. రాష్ట్రంలో మొత్తం 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు ఎన్నికలు జరగనున్నాయి. 2,996 వార్డులకు పోటీ జరగనుంది.

# గొంతెమ్మ కోర్కెలొద్దు.. పొత్తులపై తేల్చేసిన పొంగులేటి

ఈ సందర్భంగా ఓ న్యూస్ చానల్ తో మాట్లాడిన పొంగులేటి.. కలిసి వచ్చే పార్టీలకు కాంగ్రెస్ తలపులు ఎప్పుడు తెరిచే ఉంటాయన్నారు. గొంతెమ్మ కోరికలు కోరకుండా కలిసి వచ్చే ప్రతి రాజకీయపార్టీని కాంగ్రెస్ గతంలో మాదిరిగా కలుపుకుని పోతుందన్నారు. మున్సిపల్ ఎన్నికలు దొరల పాలనకు చరమగీతం పాడే సెమీ ఫైనల్స్ అన్నారు. ఈ ఎన్నికల్లో ఓడిపోతే ఏం చేస్తారో బీఆర్ఎస్ చెప్పాలన్నారు. ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తామన్నారు. ప్రజలతో మమేకమైన వారికే పార్టీ బి–ఫామ్స్ ఇస్తుందన్నారు. గ్రామ పంచాయతీలాగే మున్సిపల్ ఎన్నికల్లోనూ విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

# ఎన్నిలకు ఇంకా మూడేళ్లు ఉంది.. ఆలోపు ఏదైనా జరగొచ్చు

### ఆలోపు ఏదైనా జరుగొచ్చు

అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా మూడేళ్లు ఉంది.. ఆలోపు ఏదైనా జరుగొచ్చు అని షాకింగ్ కామెంట్స్ చేశారు. తనపై బీఆర్ఎస్, బీజేపీ నేతలు చేస్తున్న విమర్శలను పట్టించుకోను.. నేను ఏ పార్టీలో ఉన్నానో చెప్పాల్సిన అవసరం లేదని అన్నారు. కాగా, బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచిన కృష్ణ మోహన్ రెడ్డి శుక్రవారం కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఎన్నికల అభ్యర్థుల నామినేషన్ల ర్యాలీలో పాల్గొనడం హాట్ టాపిక్‌గా మారింది. కాంగ్రెస్ అభ్యర్థుల ర్యాలీలో పాల్గొనడమే కాకుండా వారిని గెలిపించాలంటూ కోరారు.

# కేసీఆర్ పై సీఎం రేవంత్ రెడ్డి కక్ష్య సాధింపు రాజకీయాలు

నంది నగర్ నివాసం వద్ద గోడకు సీట్ నోటీసులు అంటించడం సరి కాదన్నారు. తెలంగాణ తల్లీ విగ్రహ ఆవిష్కరణ సందర్భంలో పొన్నం ప్రభాకర్, సమక్క జాతర సందర్భంగా మహిళా మంత్రులు సీతక్క, కొండ సురేఖలు ఎర్రవెల్లి ఫాం హౌజ్ లో మాజీ సీఎం కేసీఆర్ కు ఆహ్వాన పత్రికలు అందించారని గుర్తు చేశారు. మంత్రులకు తెలిసిన విషయం పోలీసులకు, హోంమంత్రికి తెలియక పోవడం విడ్డూరంగా ఉందన్నారు. అఫిడవిట్ లో ఉన్న అడ్రస్ కు నోటీసులు పంపించామని పోలీసు వాదన సత్య దూరం అన్నారు. మాజీ మంత్రి హరీశ్ రావు, తనకు నోటీసులు జారీ చేసిన అడ్రస్, ఎన్నికల అఫిడవిట్ లో ఉన్న వేరు కాదా అని సూటిగా ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల అఫిడవిట్ లో కొండగల్ అడ్రస్ ఉందని, ఓ సందర్భంలో పోలీసులు బంజారాహిల్స్ నివాసంలో నోటీసులు అందజేశారని గుర్తు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి కి ఓ న్యాయం..? మాజీ సీఎం కేసీఆర్ కు ఓ న్యాయమా..? అని సూటిగా ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వ కక్ష్య సాధింపు రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. ప్రజా క్షేత్రంలో కాంగ్రెస్ పార్టీకి త్వరలో భంగ పాటు తప్పదని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ జోస్యం పలికారు.

### విచారణ పేరిట వ్యక్తిత్వ హననం

అలీబాబా దొంగల ముఠా కాంగ్రెస్ ప్రభుత్వం కోల్ బ్లాక్, లిక్కర్ సీసాలా లేబుల్, ప్రభుత్వంలో జరుగుతున్న అవినీతిని పక్క దారి పట్టించేందుకు సిట్ పేరిట బీఆర్ఎస్ నేతల పై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. ప్రశ్నించే గొంతుల గొంతు నొక్కే క్రమంలోనే ఫోన్ ట్యాపింగ్ కు సంబంధం లేని మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు తన్నీరు హరీశ్ రావు, కేటీఆర్, రాజ్య సభ సభ్యుడు సంతోష్ రావు లకు నోటీసుల జారీ చేశారన్నారు. సాక్షుల పేరిట పిలిచి 7 నుంచి 9 గంటల విచారిస్తూ మీడియాలో వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజు, రెడ్డి ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

# హార్వర్డ్‌లో విద్యార్థుల బృందంతో రేవంత్ రెడ్డి భేటీ

ప్రపంచ ప్రఖ్యాత విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు అలుమ్నీలతోనూ సీఎం చర్చలు జరిపారు. ఈ భేటీల్లో నాయకత్వ లక్షణాలు, విజయానికి అవసరమైన విలువలు, ఆర్థిక వృద్ధి, అభివృద్ధి నమూనాలు, సుస్థిరత, పర్యావరణ సవాళ్లు, రైతులు, మహిళలు, యువతకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ విధానాలు వంటి అనేక అంశాలపై లోతైన చర్చ జరిగింది. ముఖ్యంగా మారుతున్న ప్రపంచ పరిస్థితుల్లో ప్రజాస్వామ్య పాలన పాత్రపై సీఎం తన అభిప్రాయాలను పంచుకున్నారు.
తెలంగాణ పరిపాలనపై తన దృక్పథాన్ని వివరిస్తూ మార్పు దిశగా నాయకత్వం వహించడంలో ఎదురయ్యే సవాళ్లను సీఎం ప్రస్తావించారు. తెలంగాణ రైజింగ్ 2047 అనే తన దీర్ఘకాలిక విజన్ ను ఈ సందర్భంగా వివరించారు. సమగ్ర వృద్ధి ప్రతి వర్గానికి భాగస్వామ్యాన్ని కల్పించే అభివృద్ధి స్టేక్ హోల్డర్ పార్టిసిపేషన్ శక్తివంతీకరణ ఆధారిత పాలన ద్వారా తెలంగాణను దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఈ విజన్ తెలంగాణకు భవిష్యత్తులో ఎలా అవకాశాలను తెరుస్తుందో వివరంగా చెప్పారు.
ఈ సమావేశాల్లో ఒక విద్యార్థుల బృందం నాయకత్వంపై బోధించాలని సీఎంను కోరగా అందుకు ఆయన సరదాగా స్పందించారు. ఈ విషయంలో హార్వర్డ్ ప్రొఫెసర్లే ఉత్తములు అని వ్యాఖ్యానిస్తూ, తాను మోసపూరిత ప్రొఫెసర్ పాత్రను ధరించదలుచుకోలేదని హాస్యంగా అన్నారు. పరస్పర సంభాషణ అనుభవాలు పంచుకోవడం పరస్పర అధ్యయనం ఆధారంగా జరిగే ద్విముఖ చర్చలకే తాను ఎక్కువ ప్రాధాన్యం ఇస్తానని సీఎం స్పష్టం చేశారు. ఇటువంటి చర్చల ద్వారానే నిజమైన నాయకత్వం రూపుదిద్దుకుంటుందని పేర్కొన్నారు.
భారతదేశ భవిష్యత్తుకు తెలంగాణలోని హైదరాబాద్ కీలక పాత్ర పోషిస్తున్నాయని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న విద్యార్థులు, యువత భారత్‌తో ముఖ్యంగా తెలంగాణతో అనుసంధానం పెంచుకొని పనిచేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రైజింగ్ బ్రాండ్ అంబాసిడర్లుగా మారాలని విద్యార్థులను కోరారు. ఈ పిలుపుకు విద్యార్థులు సానుకూలంగా స్పందించారు. తెలంగాణ అభివృద్ధి ప్రయాణంలో తమ నైపుణ్యాన్ని శక్తిసామర్థ్యాన్ని వినియోగించేందుకు సిద్ధంగా ఉన్నామని, రాష్ట్ర గ్లోబల్ ప్రతిష్ఠను మరింత బలోపేతం చేయడంలో భాగస్వాములుగా నిలుస్తామని వారు స్పష్టం చేశారు.

# మున్సిపల్ ఎన్నికల ముందు బీఆర్ఎస్ కాంగ్రెస్ కుట్రలు..

### బీఆర్ఎస్, కాంగ్రెస్ కలిసి కుట్రలు:

ప్రజల ఫోన్లు ట్యాప్ చేసిందే కాకుండా డ్రామాలు చేస్తున్నారన్నారు. చివరకు బీఆర్ఎస్, కాంగ్రెస్ కలిసిపోవడం ఖాయం అని కానీ చట్టాలను గౌరవించి విచారణకు హాజరుకావాల్సిందే కదా అని ప్రశ్నించారు. మునుగోడులో బీజేపీ నేతల ఫోన్లు ట్యాప్ చేసి బీఆర్ఎస్ ఆ ఎన్నికల్లో గెలుపొందిందని ఆరోపించారు. బీఆర్ఎస్ మునిగిపోయే నావ లాంటిదని కారు సారు పదహారు అని గతంలో అన్నారని కానీ ఇప్పుడు సారు లేరు కారు గ్యారేజ్ కు పోయిందని ఎద్దేవా చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ కలసి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ కు అభ్యర్థులే లేరన్నారు. బీఆర్ఎస్ నేతలకు ఇంకా దురంహాకారం పోలేదన్నారు. బీఆర్ఎస్ ను ప్రజలు తిరస్కరించిన ఇంకా తెలంగాణలో బీజేపీ ఎక్కడుందని వారు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు.

# కేసీఆర్‌కు సిట్ వేధింపులు.. రాష్ట్రవ్యాప్త బీఆర్ఎస్ ఆందోళనలకు కేటీఆర్ పిలుపు

ప్రతి మున్సిపల్ వార్డు, నియోజకవర్గ కేంద్రాల్లో పెద్ద ఎత్తున బైక్ ర్యాలీలు నిర్వహించాలని, నల్ల జెండాలతో నిరసన తెలపాలని కేటీఆర్ సూచించారు. అలాగే నగరాలు, పట్టణాల్లోని ప్రధాన కూడళ్లలో ధర్నాలు, రాస్తారోకోల ద్వారా ప్రభుత్వ వైఖరిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ ఆందోళనల్లో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు. ఇతర బీఆర్ఎస్ సీనియర్ నేతలు ప్రత్యక్షంగా పాల్గొని విజయవంతం చేయాలని కేటీఆర్ సూచించారు. అలాగే ఈ నిరసన కార్యక్రమాలన్నీ అత్యంత శాంతియుతంగా జరగాలని, ఎక్కడ పోలీసులతో ఘర్షణలకు దిగవద్దని పార్టీ శ్రేణులకు కేటీఆర్ స్పష్టమైన సూచనలు చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా తమ నిరసనను గట్టిగా వినిపించాలని ఆయన పేర్కొన్నారు. కేసీఆర్ విచారణకు అంగీకరించిన తరుణంలోనే పార్టీ క్యాడర్ ఈ స్థాయిలో రోడ్లపైకి రానుండటంతో రాష్ట్రవ్యాప్తంగా ఉద్రిక్తత నెలకొనే అవకాశం ఉంది.

# చర్లపల్లిలో తల్లి బిడ్డల ఆత్మహత్య.. సూసైడ్ నోట్‌లో సంచలన విషయాలు

**స్టార్ త్రినేత్రం, హైదరాబాద్ :**


మేడ్చల్ జిల్లా చర్లపల్లిలో రైలు కింద పడి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలో కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. చెంగిచర్లకు చెందిన విజయ (35) తన ఇద్దరు పిల్లలు విశాల్(17), చేతన (18) తో కలిసి తెల్లవారుజామున చర్లపల్లి–ఘట్ కేసర్ రైల్వే స్టేషన్ల మధ్య రైలుకు ఎదురెళ్లి ఆత్మహత్యకు పాల్పడింది. సాఫ్ట్ వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్న విజయ.. హాస్టల్ లో ఉంటున్న తన ఇద్దరు పిల్లలను తీసుకుని వచ్చి మరీ ఆత్మహత్యకు పాల్పడాల్సిన అవసరం ఏమొచ్చిందనే అనుమానాలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో చర్లపల్లి రైల్వే స్టేషన్ లో విజయ పార్క్ చేసిన కారులో సూసైడ్ లేఖ లభ్యమైంది.

### నాతో పాటే నా పిల్లలు:

'నా జీవితం నచ్చట్లేదు.. బతకాలని ప్రయత్నించినా నా వల్ల కావడం లేదు. పిల్లల్ని వదిలి వెళ్లడం నాకు ఇష్టం లేదు. నాతో పాటే పిల్లలను తీసుకువెళ్తున్నా.. క్షమించు అమ్మా' అంటూ రాసి ఉన్న లెటర్ కారులో లభించచింది.విజయ కుటుంబంలో ఆర్థిక సమస్యలు ఏమి లేవని విజయ తల్లి మీడియాతో వెల్లడించారు. విజయ భర్త సురేందర్ రెడ్డి దుబాయ్‌లో ఉంటున్నారని, నాలుగు నెలలుగా ఆయన ఇండియాకు రాలేదని చెప్పారు. అయితే కుటుంబ సభ్యులు చెబుతున్నట్లు ఫ్యామిలీ అంతా అన్యోన్యంగా ఉంటే విజయ ఇలాంటి డేంజర్ డిసిషన్ ఎందుకు తీసుకున్నారు అనేది ఇంకా సస్పెన్స్ గానే మారింది. అయితే పోలీసుల దర్యాప్తులో ఈ తల్లీబిడ్డల సూసైడ్ వెనుక ఏం మిస్టరీ తెలబోతోంది అనేది చూడాలి.



# అంబటికి ప్రాణహాని ఉంది.. భద్రత కల్పించాలి: డీజీపీకి వైసీపీ లేఖ



స్టార్ త్రినేత్రం, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యవహారంలో వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇంటిపై టీడీపీ శ్రేణులు దాడికి దిగిన విషయం తెలిసిందే. క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ శనివారం గుంటూరు నవభారత్ నగర్‌లోని అంబటి ఇంటిని ముట్టడించి.. కారు, ఆఫీస్ అద్దాలు, ఫర్నిచర్ ధ్వంసం చేశారు. ఈ దాడిని వైసీపీ పార్టీ తీవ్రంగా ఖండించింది. ఈ నేపథ్యంలోనే ఘటనపై డీజీపీ వైసీపీ లేఖ రాసింది. గుంటూరులో పరిస్థితి చేయి దాటిపోతోందని, రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. అంబటి రాంబాబుపై హత్యాయత్నం జరిగిందని, ఆయనకు ప్రాణ హాని ఉందని ఫిర్యాదు చేసింది. అంబటికి వెంటనే కట్టుదిట్టమైన భద్రత ఇవ్వాలని కోరింది. సంఘ విద్రోహ శక్తులు అంబటి ఇంటిపై దాడి చేశాయని పేర్కొంది. పరిస్థితిని అదుపులోకి తీసుకురావాలని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి డీజీపీ లేఖ ద్వారా మెయిల్ చేశారు. అలాగే చీఫ్ సెక్రటరీ, డీజీపీకి ఫోన్ చేసినా రెస్పాండ్ కాలేదని పార్టీ నేత బొత్స సత్యనారాయణ అన్నారు.

# అంబటి వ్యాఖ్యలు విద్వేషపూరితం.. రాష్ట్రంలో అలజడి సృష్టించే కుట్ర: హోం మంత్రి అనిత



స్టార్ త్రినేత్రం, అమరావతి : మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత అంబటి రాంబాబు గుంటూరులో చేపట్టిన నిరసన కార్యక్రమంలో సంచలన వ్యాఖ్యలు చేశారు. తిరుపతి లడ్డూలో జంతుకొవ్వు కలపలేదని నివేదిక రావడంతో రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ శ్రేణులు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి అంబటి రాంబాబు.. గుంటురులో నిరసన చేపట్టగా టీడీపీ శ్రేణులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో ఆగ్రహించిన ఆయన సీఎం చంద్రబాబుపై తీవ్ర స్థాయి పదాలతో రెచ్చిపోయారు. దీంతో తీవ్రంగా ఆగ్రహించిన టీడీపీ శ్రేణులు అంబటి నివాసం వద్ద ఆందోళన చేపట్టారు.
ఈ వ్యవహారంపై స్పందించిన హోం మంత్రి అనిత తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. వైసీపీ నేత అంబటి రాంబాబు ఉపయోగిస్తున్న భాష అత్యంత జుగుప్సాకరంగా ఉందని, ఆయన మాట్లాడే తీరును కనీసం ఆయన కుటుంబ సభ్యులు కూడా సమర్థించరని రాష్ట్ర హోం మంత్రి అనిత విమర్శించారు. అంబటి తీరుతో రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులపై ఆమె శనివారం సాయంత్రం మీడియాతో మాట్లాడారు. "అంబటి రాంబాబు ఉద్దేశపూర్వకంగానే ఇటువంటి విద్వేషపూరిత వ్యాఖ్యలు చేస్తున్నారని, రాష్ట్రంలో శాంతి భద్రతల సమస్యను సృష్టించే పన్నాగంలో భాగంగానే ఇదంతా జరుగుతోందని ఆరోపించారు. రాజకీయాల్లో హుందాతనాన్ని విస్మరించి, అధికారులను, ప్రత్యర్థులను కించపరిచేలా మాట్లాడటం సరికాదని ఆమె హితవు పలికారు.

# అంతర్జాతీయ ఎర్ర చందనం స్మగ్లర్ మహమ్మద్ అరెస్ట్



స్టార్ త్రినేత్రం, తిరుపతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శేషాచలం రిజర్వు అటవీ ప్రాంతంలో జరుగుతున్న ఎర్ర చందనం అక్రమ రవాణాను అరికట్టే లక్ష్యంతో ఎర్ర చందన అక్రమ రవాణా నిరోధక దళం ముందుకు సాగుతోంది. దళం హెడ్ ఎస్పీ సుబ్బారాయుడు మార్గదర్శకత్వంలో జిల్లా ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కఠిన చర్యలు తీసుకొంటోంది. ఒక వైపు ఎర్ర చందనం ఆక్రమ రవాణాని అరికట్టడం కోసం నిరంతరం చర్యలు చేపడుతూనే మరో వైపు జాతీయ, అంతర్జాతీయ స్మగ్లర్ల పైన ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసింది. దానితోపాటు పాత కేసులలో పరారీలో ఉన్న స్మగ్లర్లను అరెస్ట్ చేయడం కోసం ప్రత్యేక బృందాలను అధికారులు ఏర్పాటు చేశారు. అందులో భాగంగా మొహమ్మద్ ముజామిల్ అనే వ్యక్తిని అరెస్టు చేశారు. లైసెన్స్ పేరుతో ఎర్రచందనము దుంగలను చైనాకు ఎగుమతి చేస్తున్నాడని, శేషాచల అడవులలో నరికిన ఎర్రచందనము దుంగలను అక్రమ రవాణా చేస్తున్నాడని పోలీసులు పేర్కొన్నారు. అంతేకాకుండా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పలు కేసులలో ముద్దాయిగా ఉండి, పరారీలో ఉన్నాడన్నారు. ముందస్తు ప్రణాళికతో పరారీలో ఉన్న అంతర్జాతీయ ఎర్ర చందనం స్మగ్లర్ మొహమ్మద్ ముజామిల్ ను Cr. No. 60/2025 కేసులో శనివారం తిరుపతి జిల్లా, తిరుపతి రూరల్ మండలం, చిత్తూరు – నాయుడుపేట రోడ్డులో తనపల్లి క్రాస్ వద్ద అరెస్ట్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

# మహిళలను మోసం చేసిన నిందితుడు అరెస్ట్

స్టార్ త్రినేత్రం, అమరావతి : షాదీ డాట్ కామ్.. తెలుగు మాట్రిమోనీ వంటి వివాహ వేదికల ద్వారా అమాయక మహిళలను లక్ష్యంగా చేసుకుని భారీ మోసాలకు పాల్పడుతున్న చిత్తూరు జిల్లాకు చెందిన చల్లా నారాయణ అలియాస్ కృష్ణను పోలీసులు ఎట్టకేలకు అరెస్ట్ చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రత్యేకంగా రంగంలోకి దిగిన పోలీసు బృందం అతడిని చాకచక్యంగా పట్టుకుంది. నిందితుడి వద్ద నుంచి సుమారు 340 గ్రాముల బంగారం, రెండు ఖరీదైన కార్లు, పలు మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల విచారణలో నిందితుడు చిత్తూరుతో పాటు బెంగళూరు నగరంలోనూ అనేక దారుణాలకు పాల్పడినట్లు నిర్ధారణ అయింది. కేవలం ఆర్థిక మోసాలే కాకుండా తన భార్యను హత్య చేసిన కేసులో కూడా చల్లా నారాయణ ప్రధాన నిందితుడిగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. పెళ్లి పేరుతో నమ్మించి మహిళలను ఆర్థికంగా, మానసికంగా వేధిస్తున్న ఇటువంటి నేరస్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. ప్రస్తుతం నిందితుడిని రిమాండ్‌కు తరలించి, ఇంకా ఎవరైనా బాధితులు ఉన్నారా అనే కోణంలో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంపై నంగునూరు BRS యువత ఆగ్రహం



స్టార్ త్రినేత్రం, సిద్ధిపేట: కాంగ్రెస్ పార్టీ పాలనపై నంగునూరు భారత రాష్ట్ర సమితి (BRS) యువత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. శనివారం నంగునూరు మండల కేంద్రంలో BRS యువత ఆధ్వర్యంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ఘాటు విమర్శలు చేశారు. ఈ సమావేశంలో బీమర కనకరాజు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి, ప్రజా పాలన పేరుతో కమిషన్ల పాలన సాగిస్తోందని ఆరోపించారు. సమ్మక్క–సారలమ్మ జాతర వంటి మహత్తర ఆధ్యాత్మిక కార్యక్రమంలో కూడా ప్రజల ఇబ్బందులను పట్టించుకోలేదని విమర్శించారు. ఫోటో షూట్లు, రీల్స్ చేసుకుంటూ కాలయాపన చేస్తూ పాలనను పక్కనపెట్టిందని, పచ్చగా ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని అగమ్యగోచర స్థితికి తీసుకెళ్లి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి సర్కార్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. అడ్డమైన అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు పాలన చేయలేక చేతులెత్తేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం రెండు సంవత్సరాల కాంగ్రెస్ పాలనలోనే తెలంగాణ రాష్ట్రం ఇరవై సంవత్సరాలు వెనక్కి వెళ్లిందని ఆరోపించారు. రానున్న కాలంలో మళ్లీ అధికారంలోకి వచ్చేది BRS ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలంతా BRS పార్టీకి ఓటు వేసి తెలంగాణ ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకోవాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అన్ని హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. హామీలు నెరవేర్చకపోతే ప్రజా ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో BRS యువత నాయకులు కొండిల్లా రాజు, పల్లపు రాములు, గౌరవబోయిన స్వామి, అప్పిసు నర్సింహాలు, పోతన వినోద్, పల్లెపు రాజు, బీమర కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కోనాయిపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

**స్వామి వారి చల్లని చూపులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి – వంగ రాజేశ్వర్ రెడ్డి**



స్టార్ త్రినేత్రం, సిద్ధిపేట: నంగునూరు మండలం కోనాయిపల్లి గ్రామంలో శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా జరిగిన శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవ కార్యక్రమంలో వంగ రాజేశ్వర్ రెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన వంగ రాజేశ్వర్ రెడ్డికి ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, గ్రామ ప్రజలు, భక్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. స్వామివారి దయతో ఆయన చల్లని చూపు ప్రజలందరిపై ఉండి, అందరూ సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. అలాగే బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించిన ఆలయ కమిటీ సభ్యులకు, గ్రామ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. బ్రహ్మోత్సవాల నిర్వహణకు వంగ రాజేశ్వర్ రెడ్డి గారు రూ.25,000/– విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ దువ్వల మల్లయ్య, ఆలయ కమిటీ చైర్మన్ నిమ్మ విష్ణువర్ధన్ రెడ్డి, నిమ్మ ప్రదీప్ రెడ్డి, సిద్ధన్నపేట సర్పంచ్ సంగు పురేందర్, మాజీ సర్పంచులు అరగొండ వెంకటేశం, పిల్లి వెంకటేశం, మాజీ ఎంపీటీసీ రవీందర్ రెడ్డి, మల్లమారి రాజు, రాధారం శ్రీనివాస్, నిమ్మ నరసింహ రెడ్డి, నిమ్మ బాపు రెడ్డి, దువ్వల చంద్రం, పెద్ది శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సిద్దిపేటలో ఘనంగా రోడ్డు భద్రత వారోత్సవాల ముగింపు కార్యక్రమం



స్టార్ త్రినేత్రం, సిద్దిపేట: బడ్జెట్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లాలో నిర్వహించిన రోడ్డు భద్రత వారోత్సవాల ముగింపు కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని శ్రీ వాణి హైస్కూల్‌లో అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ జగ్గు మల్లారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు శంకర్ నారాయణ, శ్రీకాంత్ రెడ్డి హాజరై విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. రోడ్డు దాటేటప్పుడు ముందు కుడివైపు, తరువాత ఎడమవైపు, మళ్లీ కుడివైపు చూసి దాటాలని చెప్పారు. జీబ్రా క్రాసింగ్ ఉన్న చోట్ల మాత్రమే రోడ్డు దాటాలని, ఫుట్‌పాత్ ఉన్న చోట్ల ఫుట్‌పాత్‌పైనే నడవాలని తెలిపారు. ఫుట్‌పాత్ లేని చోట్ల రోడ్డు కుడివైపున నడవడం సురక్షితమని వివరించారు. వాహనాలు నడుస్తున్న సమయంలో ట్రాఫిక్ ఐలెండ్ నుంచి అకస్మాత్తుగా బయటకు అడుగు పెట్టడం ప్రమాదకరమని, నిలిచి ఉన్న వాహనాల వెనుక నుంచి పరిగెత్తి వెళ్లరాదని హెచ్చరించారు. కనపడని రోడ్డు మలుపుల వద్ద రోడ్డు దాటేటప్పుడు అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పోలీస్ మనందరి మిత్రుడని, అవసరమైనప్పుడు వారి సహాయాన్ని పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బడ్జెట్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగ్గు మల్లారెడ్డి, సిద్దిపేట జిల్లా జనరల్ సెక్రటరీ సత్యం, క్యాషియర్ జీ. శ్రీకాంత్, కార్యవర్గ సభ్యులు బాలకృష్ణ, సికిందర్, రవీందర్ రెడ్డి, వెంకటేష్, సురేష్‌లతో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# మిట్టపల్లి కేజీబీవీ, గురుకుల పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

## మధ్యాహ్న భోజన నాణ్యతపై ప్రత్యేక దృష్టి

**స్టార్ త్రినేత్రం, సిద్ధిపేట:**



సిద్ధిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)తో పాటు సమీపంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల మరియు జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ కె. హైమావతి శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కేజీబీవీలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులకు వడ్డిస్తున్న అన్నం, గుడ్డు, క్యాలీఫ్లవర్ కూర, పప్పు, రసం, పెరుగులను పరిశీలించి నాణ్యతపై ఆరా తీశారు. డైనింగ్ హాల్‌లో మాత్రమే భోజనం వడ్డించాలని, ఇతర ప్రాంతాల్లో భోజనం వడ్డించరాదని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడిన జిల్లా కలెక్టర్, భోజనం చేసే సమయంలో క్రమశిక్షణతో కూడిన మంచి అలవాట్లు అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థులు మరల అన్నం లేదా కూరలు కోరినప్పుడు వారు కూర్చున్న చోటికే వెళ్లి వడ్డించాలని వంట సిబ్బందికి ఆదేశించారు. కామన్ డైట్ మెనూను తప్పనిసరిగా పాటిస్తూ, నాణ్యమైన మరియు రుచికరమైన ఆహారాన్ని విద్యార్థులు కడుపునిండా తినేలా వండాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వంటగది మరియు పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఈగలు, దోమలు రాకుండా డెటాల్ వంటి శానిటైజర్లతో క్రమం తప్పకుండా శుభ్రపరచాలని వంట సిబ్బందిని ఆదేశించారు. విద్యాలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ఎల్లప్పుడూ సక్రమంగా పనిచేసేలా చూసుకోవాలని తెలిపారు. అనంతరం కేజీబీవీ సమీపంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల మరియు జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ సందర్శించి అక్కడ విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కూరల నాణ్యతను మరింత మెరుగుపరచాలని, నిర్లక్ష్యంగా వంట చేసి విద్యార్థులకు ఆహారం అందిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. నాణ్యమైన సరుకులతో రుచికరమైన ఆహారాన్ని వండి విద్యార్థులకు అందించాలని, డైనింగ్ హాల్‌తో పాటు పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు.

# సీఎం, డిప్యూటీ సీఎంకు దేవుడే బుద్ధి చెబుతాడు: ఎమ్మెల్యే వై బాలనాగిరెడ్డి

**స్టార్ త్రినేత్రం, మంత్రాలయం:**



తిరుమల పవిత్ర ప్రసాదం 'లడ్డు' వ్యవహారంలో కూటమి ప్రభుత్వం నీచమైన రాజకీయాలకు పాల్పడుతోందని మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వారి స్వగ్రామమైన రాంపురంలోని శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి మొక్కులు చెల్లించుకున్న అనంతరం విలేకరులతో మాట్లాడారు. పవిత్రమైన తిరుపతి లడ్డు విషయంలో సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పచ్చి అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని బాలనాగిరెడ్డి మండిపడ్డారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే కోట్లాదిమంది భక్తుల మనోభావాలతో ఆడుకుంటున్నారని ఆయన ఆరోపించారు. లేని తప్పును ఉన్నట్లుగా చూపిస్తూ భక్తుల విశ్వాసాన్ని దెబ్బతీసిన ఈ ఇద్దరు నాయకులకు ఆ భగవంతుడే తగిన బుద్ధి చెబుతారని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు రాంపురంలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు నేతలు తెలిపారు. తిరుమల పవిత్రతను కాపాడాలని, రాజకీయాల కోసం దేవుడిని వాడుకుంటున్న వారిపై స్వామివారి ఆగ్రహం తప్పదని వారు వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో బసాపురం భీమిరెడ్డి, పెద్దకడబూరు పురుషోత్తం రెడ్డి, వగరూరు విశ్వనాథ రెడ్డితోపాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ట్రాన్స్ ఫార్మర్ల దొంగలు అరెస్టు

**స్టార్ త్రినేత్రం, చిత్తూరు:**



జిల్లాలోని పలు మండలాల్లో వరుసగా ట్రాన్స్ ఫార్మర్లను పగులగొట్టి కాపర్ వైరును దొంగిలిస్తున్న ముగ్గురు ముఠా సభ్యులను కాణిపాకం పోలీసులు శనివారం అరెస్టు చేశారు. నిందితుల నుంచి సుమారు రూ.85,400 విలువైన 61 కేజీల కాపర్ వైర్, దొంగతనానికి ఉపయోగించిన పరికరాలు, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల మేరకు.. గత కొంతకాలంగా కాణిపాకం, ఐరాల, పెనుమూరు, గంగాధర నెల్లూరు, ఎస్.ఆర్.పురం, పూతలపట్టు, ఎన్ఆర్ పేట, చిత్తూరు తాలూకా పోలీస్ స్టేషన్ల పరిధిలో రాత్రి సమయాల్లో వరుసగా ట్రాన్స్ ఫార్మర్లు దొంగతనానికి గురవుతున్నాయి. నిందితులు ఇప్పటివరకు 97 ట్రాన్స్ ఫార్మర్లను ధ్వంసం చేసి, సుమారు 1,000 కేజీల కాపర్ వైరును అపహరించినట్లు విచారణలో తేలింది. వీరిపై వివిధ పోలీస్ స్టేషన్లలో 29కి పైగా కేసులు నమోదై ఉన్నాయి. కాణిపాకం పరిధిలో జరిగిన చోరీపై ఎస్ఐ నరసింహులు నమోదు చేసిన కేసు ఆధారంగా జిల్లా ఎస్పీ తుషార్ డూడి రంగంలోకి దిగారు. చిత్తూరు ఎస్పీడీఓ టి.సాయినాథ్ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయగా, జనవరి 30 సాయంత్రం 6:30 గంటల సమయంలో టానా కూడలి వద్ద చిత్తూరు నగరం కొంగారెడ్డిపల్లెకు చెందిన పులిచర్ల బాలకృష్ణ రెడ్డి (42), పులిచర్ల చంద్రబాబు (39), జీడీ నెల్లూరు మండలం వెంకటాపురంకు చెందిన పి. గణేష్ (35)ను అదుపులోకి తీసుకుని విచారించగా .. వీరే చోరీలకు పాల్పడినట్లు తేలింది. ఈ కేసును చాకచక్యంగా ఛేదించి నిందితులను అరెస్ట్ చేసిన పోలీస్ అధికారులు, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# మాజీ మంత్రి అంబటి రాంబాబుపై కేసు నమోదు



**స్టార్ త్రినేత్రం, అమరావతి :**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యవహారంలో వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు చిక్కుల్లో పడ్డారు. సీఎంను అసభ్య పదజాలంతో దూషించారన్న ఆరోపణలపై గుంటూరు జిల్లా నల్లపాడు పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. అంబటి రాంబాబు ముఖ్యమంత్రిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన టీడీపీ శ్రేణులు, గుంటూరు జిల్లా ఎస్పీకి అధికారికంగా ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును పరిశీలించిన పోలీసులు ప్రాథమిక ఆధారాలతో ఆయనపై కేసు నమోదు చేశారు.

**అంబటి నివాసం వద్ద తీవ్ర ఉద్రిక్తత**

గుంటూరులోని నవభారత నగర్‌లో ఉన్న అంబటి రాంబాబు నివాసం వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. టీడీపీ శ్రేణులు భారీ సంఖ్యలో అక్కడికి చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఆగ్రహించిన కొందరు కార్యకర్తలు అంబటి ఇంటిపై రాళ్లు రువ్వడం, ఆఫీస్ అద్దాలు, ఫర్నిచర్, కారును ధ్వంసం చేశారు. పరిస్థితిని గమనించిన పోలీసులు తక్షణమే అంబటి నివాసం వద్దకు చేరుకుని భారీగా మోహరించారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో పోలీసుల పహారా కొనసాగుతోంది.

# వైసీపీ నేతలు అబద్ధాల ప్రచారానికి దిగుతున్నారు : దేవినేని ఉమ

**స్టార్ త్రినేత్రం, అమరావతి :**



అధికారం కోసం అర్రులు చాస్తున్న వైసీపీ నేతలు తమ మీడియా సంస్థల ద్వారా రోజూ అబద్ధాల ప్రచారానికి దిగుతున్నారని మాజీ మంత్రి దేవినేని ఉమ ఆరోపించారు. గొల్లపూడిలో జరిగిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదవాడికి పెన్షన్ ఇవ్వాల్సిన బాధ్యతను వైసీపీకి చెందిన 11 మంది ఎమ్మెల్యేలు పూర్తిగా మర్చిపోయారన్నారు. అధికారం కోల్పోయిన తర్వాత కూడా పశ్చాత్తాపం లేకుండా అబద్ధాలు, అసత్యాలు వండివారుస్తూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. 11 సీట్లకే పరిమితమైన వైసీపీ నేతలు రాజకీయ పరాభవాన్ని జీర్ణించుకోలేక తిరుమల లడ్డు తయారీలో కల్తీ చేసి కొవ్వు లేదని అడ్డగోలుగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రజారాజధాని అమరావతిని గుర్తించకుండా ముఖ్యమంత్రి ఎక్కడుంటే అక్కడే రాజధాని అన్న అహంకారపూరిత వ్యాఖ్యలు చేయడం వైసీపీ రాజకీయ దివాలాకోరుతనానికి నిదర్శనంగా పేర్కొన్నారు. రాజధాని విషయంలో ప్రజల మనోభావాలను వైసీపీ పూర్తిగా త్రోసిపుచ్చిందన్నారు. అందుకే ప్రజలు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పారన్నారు. ప్రతినెలా 1వ తేదీన పంపిణీ చేసే ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఫిబ్రవరి ఒకటో తేదీ ఆదివారం కావడంతో ఒక రోజు ముందుగా(జనవరి 31) పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. కొత్తగా మంజూరైన వితంతువుల పెన్షన్లు 7,944తో కలిపి మొత్తం 62.94 లక్షల మంది పెన్షన్‌దారులకు రూ.2,724 కోట్లు సచివాలయ సిబ్బంది ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్దే అందజేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం నిజమైన ప్రజాసంక్షేమానికి నిదర్శనమని తెలియజేశారు. వైసీపీ పాలనలో పేదల హక్కులు కాలరాయబడ్డాయని, ఇప్పుడు వాస్తవాలు ప్రజలకు చెప్పి చైతన్యం చేయాల్సిన బాధ్యత ప్రతి టీడీపీ కార్యకర్తపై ఉందని సూచించారు.

# జులైలో 'విశ్వంభర'



'మన శంకరవరప్రసాద్‌గారు' విజయంతో ఫుల్ జోష్‌లో ఉన్నారు కథానాయకుడు చిరంజీవి. దీంతో ఇప్పుడాయన నుంచి రానున్న తదుపరి సినిమా 'విశ్వంభర'పై ప్రేక్షకుల్లో అంచనాలు రెట్టింపయ్యాయి. వశిష్ఠ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. త్రిష, ఆషికా రంగనాథ్ కథానాయికలు. గతేడాదే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సోషియో ఫాంటసీ యాక్షన్ థ్రిల్లర్ వీఎఫ్ఎక్స్ పనుల వల్ల ఆలస్యమైంది. కాగా, ఇప్పుడీ పనులన్నీ ఓ కొలిక్కి వస్తుండటంతో జులై తొలివారంలో దీన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ విషయంపై చిరు కూడా ఇటీవల జరిగిన విలేకర్ల భేటీలో స్పందించారు. ఇది జులై 9న తెరపైకి వచ్చే అవకాశముందని.. దీనికి సంబంధించిన వీఎఫ్ఎక్స్‌ని తానింకా చూడలేదని తెలియజేశారు. మరి ఇది చిరంజీవి చెప్పిన తేదీ నాటికి అన్ని పనుల్ని పూర్తి చేసుకుని తెరపైకి వస్తుందా? లేదా? చూడాలి.

# క్లాసూ... మాసూ

ఒకవైపు 'పెద్ది' సినిమా చిత్రీకరణలో పాల్గొంటూనే... మరోవైపు కొత్త సినిమా కథకు సంబంధించిన పనులపై దృష్టి పెడుతున్నారు రామ్‌చరణ్. 'పెద్ది' తర్వాత ఆయన సుకుమార్ దర్శకత్వంలో సినిమా చేయనున్న సంగతి తెలిసిందే.



ఆ సినిమా కోసం సుకుమార్ ఎప్పట్నుంచో కథని సిద్ధం చేస్తున్నారు. ఆయన తరహా ఓ క్లాస్ కథతోపాటు... అందుకు పూర్తి భిన్నంగా ఒక మాస్ కథనీ సిద్ధం చేసినట్టు సమాచారం. 'రంగస్థలం'లో రామ్‌చరణ్‌ని మాస్ పాత్రలోనే చూపించారు సుకుమార్. మరోసారి అలాంటి విభిన్నమైన పాత్రలోనే రామ్‌చరణ్‌ని చూపించాలని సుకుమార్ భావిస్తున్నట్టు సమాచారం. రామ్‌చరణ్ కూడా మాస్ కథకే పచ్చజెండా ఊపారని సమాచారం. అందులో లుక్ కూడా గత సినిమాలకు భిన్నంగా ఉంటుందని తెలుస్తోంది. ఈ ఏడాది వేసవిలోనే ఈ సినిమా చిత్రీకరణని ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. 'పుష్ప' చిత్రాల తర్వాత సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలున్నాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లో 'పెద్ది' చిత్రీకరణ సాగుతోంది. ప్రత్యేకంగా తీర్చిదిద్దిన ఓ సెట్‌లో పాటని చిత్రీకరిస్తున్నారు.

# నా వయసుపై చాలా చర్చలు



"ఇది నిజంగా జరగాలని నేను కోరుకున్నా. కానీ అది ఎలా, ఎప్పుడు అనేదే ఓ ప్రశ్న. ఆ ప్రశ్నలన్నింటికీ ఈ సినిమాతో నాకు సమాధానాలు దొరికినట్లు భావిస్తున్నా. నాపై నమ్మకం ఉంచి ఈ అవకాశం ఇచ్చిన అందరికీ కృతజ్ఞతలు తెలుపుతూనే ఉన్నాను. చిన్నప్పుడు అమ్మానాన్నతో కలిసి ఓ షాపింగ్ మాల్‌కు వెళ్లినప్పుడు నన్ను చూసి ఓ బ్రాండ్‌లో నటించాలని సదరు ఉత్పత్తికి చెందిన ప్రతినిధులు కోరారు. అలా అప్పటి నుంచి చాలా ప్రకటనలలో కనిపిస్తూ సినిమాల్లోకి వచ్చాను. నేను నటించిన ప్రకటనలలో ఒక దానిని ముఖేశ్ చబ్రా చిత్రీకరించారు. తర్వాత ఆయన నన్ను ఓ ఆడిషన్‌కి రమ్మని పిలిచారు. అది 'ధురంధర్' సినిమా కోసమని నాకు తెలియదు. స్క్రిప్ట్ కూడా భిన్నంగా ఉంది. ఒక సాధారణ ఆడిషన్‌లా అదీ అనుకుని ఇచ్చేసి.. కొన్నాళ్ల తర్వాత దాని గురించి మర్చిపోయా. కానీ, ఒక నెల తర్వాత వేర్వేరు సన్నివేశాలలో ఆరు ఆడిషన్‌లు ఇచ్చాను. నా వయసు గురించి సినిమాకి ముందు చాలా స్పష్టంగా చర్చలు జరిగాయి".


## ఐశ్వర్య నన్ను గుర్తుంచుకున్నారు

"ఓ తమిళ చిత్రంలో నటుడు విక్రమ్ కుమార్తెగా చాలా చిన్న వయసులో నటించాను. ఆ సినిమా అనుభవాలు నాకు గుర్తులేవు కానీ, విక్రమ్‌ని అప్పా అని పిలిచేదాన్ని అదే గుర్తుంది. ఆ సినిమా తర్వాత ఇమ్రాన్ హష్మీ, సల్మాన్ ఖాన్, ఇర్ఫాన్ ఖాన్‌లతోను నటించాను. సల్మాన్ చిత్రం నాకు బాగా గుర్తుంది. కానీ ఆయనను కలిసే అవకాశం నాకు రాలేదు. దర్శక నిర్మాత మణిరత్నం 'పొన్నియిన్ సెల్వన్' సినిమా సెట్‌లో ఐశ్వర్య రాయ్‌ని చూశాను. ఆమె చాలా నిజాయతీగా ఉండేవారు. సెట్‌లో సహాయం చేస్తూనే నన్ను సొంత కూతురిలా చూసుకునేవారు. ఈ సినిమా సీక్వెల్ చిత్రీకరణలో మొదటిసారి కలిసినప్పుడు ఆమె నన్ను గుర్తుంచుకుంటారా లేదా అని ఆలోచిస్తూనే ఉన్నా. కానీ ఆమె నన్ను గుర్తుపట్టారు. వెనక్కి తిరిగి చూసుకుంటే బాలనటిగా పనిచేయడం చిత్రపరిశ్రమలోకి వచ్చాక కలిసొచ్చిందని అనిపిస్తుంది".

## దాని గురించి తక్కువ మాట్లాడాలనుకుంటా..

"ఎవరైనా బాల్యంలో భావోద్వేగాలను స్వచ్ఛంగా అనుభవిస్తారు. బాధను బాధగా.. సంతోషాన్ని సంతోషంగానే. ఆ సమయంలో ఉన్న పెద్ద ప్రయోజనమేంటంటే.. ఎలాంటి అడ్డంకులు ఉండకపోవడం. మొదటి నుంచి నేను పనిచేసే విధానాలలో కూడా ఎలాంటి సమస్యలు ఎదురు కాకుండా ముందుకుసాగిపోవడానికి నావంతు ప్రయత్నిస్తాను. వృత్తి పరంగా ఏం జరిగినా దాని గురించి నేను నా తల్లిదండ్రులతో మాత్రమే పంచుకుంటాను. తర్వాత నా సోదరుడు. ఇండస్ట్రీలో పేరు వచ్చినప్పుడు విమర్శలు కూడా వస్తాయని నాకు తెలుసు. చిన్నప్పుడంటే ఇవన్నీ నాకు తెలియదు. నేను దేనికోసం పనిచేయాలో నాకు తెలుసు. నా వ్యక్తిగత జీవితాన్ని కాపాడుకోవడం నాకు చాలా ఇష్టం. దాని గురించి తక్కువ మాట్లాడటం ఉత్తమం అనుకుంటాను. అలా కాపాడుకుంటూనే.. ఏ అవకాశం వచ్చినా చేయడానికి సిద్ధంగా ఉన్నాను. చాలా కాలంగా ఇదే కోరుకుంటున్నాను".

# అలియా నిర్మాణంలో 'డోంట్ బీ షై'



తనదైన నటనతో సినీప్రియుల్ని ఆకట్టుకునే బాలీవుడ్ అందాల తార అలియా భట్.. 'డార్లింగ్స్', 'జిగ్రా' లాంటి చిత్రాలతో నిర్మాతగా కూడా నిరూపించుకుంది. ఇప్పుడామె ప్రముఖ ఓటీటీ సంస్థ అమెజాన్ ప్రైమ్ వీడియోతో కలిసి తన నిర్మాణ సంస్థ ఎటర్నల్ సన్‌షైన్ పతాకంపై మరో చిత్రాన్ని తీర్చిదిద్దుతుంది. తాజాగా దీనికి 'డోంట్ బీ షై' అనే పేరును ఖరారు చేసినట్లు తెలుపుతూ.. ఇన్‌స్టా వేదికగా ఓ వీడియోను పంచుకుంది అమెజాన్ ప్రైమ్. "ఈ కథలో అన్నీ ఉంటాయి. ప్రేమ, అద్భుతం, పాటలు, అమ్మాయిలు, అబ్బాయిలు.. ఇంకా ఓ తాబేలు కూడా ఉంది" అనే వ్యాఖ్యను జోడించింది. శ్రీతి ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్నారు. నటీనటుల వివరాలు ఇంకా వెల్లడికానప్పటికీ.. ఈ చిత్రం శ్యామిలీ షై దాస్ అనే 20ఏళ్ల అమ్మాయి చుట్టూ తిరుగుతుందని చిత్రవర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా అలియా మాట్లాడుతూ.. "ఇది నాకు చాలా ప్రత్యేకమైన ప్రాజెక్ట్. మేము ఎప్పుడూ నిజాయతీగా అనిపించే కథలకే మద్దతు ఇవ్వాలని కోరుకుంటున్నామ"ని చెప్పింది.

# ఆ అందమైన జ్ఞాపకాల్ని గుర్తు చేసే చిత్రం



'టూరిస్ట్ ఫ్యామిలీ' సినిమాతో దర్శకుడిగా అందర్నీ మెప్పించారు అభిషన్ జీవింత్. ఇప్పుడాయన్ని హీరోగా పరిచయం చేస్తూ మదన్ తెరకెక్కించిన చిత్రం 'విత్ లవ్'. అనస్వర రాజన్ కథానాయిక. సౌందర్య రజనీకాంత్, మగేశ్ రాజ్ సమర్పిస్తున్నారు. ఈ సినిమా ఏషియన్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ ద్వారా ఫిబ్రవరి 6న తెలుగు ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే నటుడు, నిర్మాత రానా దగ్గుబాటి శుక్రవారం హైదరాబాద్‌లో ట్రైలర్ విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. "తొలిసారి ఈ టీజర్ చూసినప్పుడు చాలా ఆనందంగా అనిపించింది. ఓ జంట మనసులోనే దాగి ఉండిపోయిన ప్రేమకథతో తెరకెక్కింది. తప్పకుండా అందరికీ కనెక్ట్ అవుతుంది" అన్నారు. "నా 'టూరిస్ట్ ఫ్యామిలీ' చిత్రాన్ని గొప్పగా ఆదరించిన తెలుగు ప్రేక్షకులకు కృతజ్ఞతలు. ఇప్పుడు నేను హీరోగా నటించిన ఈ సినిమాని అలాగే ఆదరిస్తారని నమ్ముతున్నా. ఇది మంచి ప్రేమకథతో రూపొందిన చిత్రం. మనందరి జీవితాల్లోని అందమైన జ్ఞాపకాల్ని తిరిగి గుర్తు చేసేలా ఉంటుంది" అన్నారు. నిర్మాత సౌందర్య రజనీకాంత్ మాట్లాడుతూ.. "అభిషన్‌ని మేము హీరోగా పరిచయం చేస్తున్నందుకు సంతోషంగా ఉంది. బయటకు చెప్పలేక.. మనసుల్లోనే దాగుండిపోయిన ప్రేమకథతో రూపొందింది. ఇది చాలా వినూత్నంగా ఉంటుంది. దీంట్లోని స్కూల్ లైఫ్ ఎపిసోడ్స్ అందరికీ బాగా కనెక్ట్ అవుతాయి" అన్నారు. ఈ కార్యక్రమంలో మగేశ్, అనస్వర తదితరులు పాల్గొన్నారు.

## చర్చల దశలో రజనీ - కమల్ సినిమా..

రజనీకాంత్ – కమల్‌హాసన్ కథానాయకులుగా త్వరలో ఓ సినిమా రానుందని.. దానికి నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహిస్తారని నెట్టింట వార్తలు వినిపిస్తున్న సంగతి తెలిసిందే. దీనిపై సౌందర్య రజనీకాంత్ 'విత్ లవ్' వేడుకలో స్పందించారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్‌పై చర్చలు జరుగుతున్నాయని.. దానిపైన నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటిస్తేనే బాగుంటుందని సౌందర్య చెప్పారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY DHEEKONDA SHIVAKRISHNA, PRINTER TELUKALA BHASKAR REDDY, PRINTED AT RAINBOW OFFSET PRINTERS,6-8-142, SAGARA VEEDHI CHOWRASTHA, HANUMAKONDA, WARANGAL,TELANGANA-506001.PUBLISHED AT: H.NO: 7-37, ZAFFERGADH ROAD, WARDHANNAPET, WARANGAL, TELANGANA- 506313. EDITOR: DHEEKONA SHIVAKRISHNA. PRGI NO: TGTEL/25/A0438, CELL: 9700950084, 9948206302, email: startrinethram28@gmail.com